క్లుప్తంగా

జహంగీర్ దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: జహంగీర్ దర్గాలో ఆదివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కాటేదాన్‌లోని అమ్మా గార్డెన్‌లో న్యాజ్ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



తూళ్ల దేవేందర్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: మాజీ మంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా బీజేపీ నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.అంజన్‌కుమార్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య ఆదివారం దేవేందర్‌గౌడ్ నివాసంలో ఆయనను కలిసి బొకే అందజేసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

రాజేంద్రనగర్: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చాంద్రాయణగుట్ట బండ్లగూడకు చెందిన షేక్‌షావళి(19) సుభాన్‌కాలనీలోని కిరాణాషాపులో పని చేస్తున్నాడు. ఈ నెల 16న సాయంత్రం వర్షం కురుస్తుండడంతో షాపులోని సామగ్రిని లోపలికి తీసుకువస్తూ జారిపడ్డాడు. తలకు గాయం కావడంతో యజమాని అతడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిద్ధమవుతున్న హలీం బట్టీలు



టోలిచౌకి రహ్మత్ హోటల్ వద్ద ..

గోల్కొండ: మార్కెట్‌లో రంజాన్ మాసం సందడి నెలకొంది. రంజాన్ మాసం అంటే గుర్తుకొచ్చేది హలీం, వివిధ రకాల పండ్లు. ఇదిలా ఉండగా రంజాన్ మాసంలో లభించే హలీంకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ప్రత్యేకంగా ఇటుల బట్టీతో తయారయ్యే హలీం రుచి ప్రత్యేకంగా ఉండటమే కాకుండా హలీంలో ఎన్నో పోషకాలు కూడా ఉన్నాయి. రంజాన్ మాసంలో రెస్టారెంట్ల వారు పోటాపోటీగా హలీం అమ్మకాలు సాగిస్తారు. టోలిచౌకితో పాటు గోల్కొండ, అహ్మద్‌నగర్‌లలో పలు రెస్టారెంట్ల వారు 30 సంవత్సరాలుగా హలీం తయారు చేస్తున్నారు. ఈ బట్టీకి కాల్చిన ఇటుకలను వాడుతారు. అంతేకాకుండా ఇందులో సిమెంట్ వాడకుండా ఎర్రమట్టినే వాడుతారు. బట్టీలలో హలీం తయారు చేయడానికి ఎల్‌పీజీ గ్యాస్ కాకుండా కట్టెలనే వాడుతారు. ఈ బట్టీపై దేక్షా (పాత్ర)ను ఉంచుతారు.

శ్రీచైతన్యలో ఫ్యామిలీ గ్లోరీ

గోల్కొండ: పెద్దలను గౌరవించడంతో పాటు మానవ విలువలు తెలిపేందుకు తమ పాఠశాలలో ఫ్యామిలీ గ్లోరీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మెహిదీపట్నం శ్రీచైతన్య పాఠశాల జోన్ ఏజీఎం కృష్ణ అన్నారు. ఆదివారం పాఠశాలలో స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా జరిగిన ఫ్యామిలీ గ్లోరీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత నెల రోజులుగా పిల్లలకు మానవతా, కుటుంబ విలువలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను విద్యార్థులు పూజించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వాతి, ఎగ్జిక్యూటివ్ డీన్ పుల్లారావు, కోఆర్డినేటర్ రవి, వైస్ ప్రిన్సిపాల్ పల్లవి, డీన్ ఓంకార్, శివ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

- భారీ వర్షంతో దెబ్బతిన్న పంటలు
- వడగండ్లతో నేలపాలు
- ఆందోళనలో రైతులు
- పండ్లు, కూరగాయలు, పూల తోటలపై తీవ్ర ప్రభావం



నేలకొరిగిన కాకరపంట

శంషాబాద్ రూరల్: అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురు గాలులకు తోడు వడగండ్ల వాన కరవడంతో రైతులను కోలుకోలేని దెబ్బ తీసింది. మండల పరిధిలో గత మూడు రోజులుగా కురుస్తు న్న భారీ వర్షాలతో పండ్లు, కూరగాయలు, పూల తోటలకు తీరని నష్టం వాటిల్లింది. దిగుబడి దశలో ఉన్న పంటలు దెబ్బతినడంతో రైతులు ఆవేదనకు లోనవుతున్నారు. మండల పరిధిలోని పలు గ్రామా ల్లో రైతులు కూరగాయలు, పూల తోటలతో పాటు పండ్ల తోటలను సాగు చేస్తున్నారు. టమోటా, క్యాబేజీ, క్యాలీ ఫ్లవర్‌తో పాటు పలు రకాల ఆకుకూరలు వడగండ్ల వానకు దెబ్బతిన్నాయి. మామిడి తోటల్లో కాయలు నేలరాలి తీరని నష్టం వాటిల్లింది. మండల పరిధిలో రైతులు రబీలో ఎక్కువగా పూలు, కూరగాయల పంటలను సాగు చేస్తుంటారు. వరి కోతలు పూర్తి చేసిన తర్వాత ఈ భూముల్లో రబీలో పూలు, కూరగాయలు సాగు చేస్తుంటారు.



దెబ్బతిన్న టమోట తోట

మండలంలో పంటల సాగు వివరాలు..

పంటలు	సాగు విస్తీర్ణం
పూలు	312 ఎకరాలు
పండ్లు	1300 ఎకరాలు
కూరగాయలు	800 ఎకరాలు

మూడు రోజులుగా భారీ వర్షాలు

ఈ నెల 16న కురిసిన భారీ వర్షంతో పంటలకు తీరని నష్టం వాటిల్లింది. ఆ రోజు 46.4 ఎంఎం వర్షపాతం నమోదైంది. 17న 2.6ఎంఎం, 18న 2.4ఎంఎం వర్షపాతం నమోదైంది. పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో పంటలు కుళ్లిపోతున్నాయి. పూల రకాల్లో చాందిని పంటలు తెగుళ్ల సోకి పూర్తిగా తుడిచిపోయాయి. మిగిలిన పూల తోటల్లో మొక్కలు నేలకొరిగాయి.

వంద ఎకరాల్లో నేలపాలు..

మండల పరిధిలో దాదాపు వంద ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. నర్కూడ, కాచారం, పెద్దగోల్కొండ, నానాజీపూర్, రామంజాపూర్, పెద్దషాపూర్, ముచ్చింతల్, తదితర గ్రామాల్లో నష్టం ఎక్కువగా ఉన్నట్లు ఉద్యానవన అధికారులు గుర్తించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వర్షాలతో దెబ్బతిన్న ఉద్యానవన పంటలకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. మడుల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని బయటికి వెళ్లేలా చూడాలి. రెండు రోజుల పాటు నేలను ఆరనివ్వాలి. తర్వాత 3 గ్రాములు కాపర్ ఆక్సిక్లోరైడ్, 0.1 గ్రాము స్ట్రెప్టోసైక్లిన్‌ను ఒక లీటరు నీళ్లలో కలిపి నేల పూర్తిగా తడిచేలా పిచికారి చేయాలి. దీంతో మొక్కలు చనిపోకుండా ఉంటాయి.

– ఉద్యానవన అధికారి సౌమ్య

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కార్పొరేటర్ మొండ్ర సంగీతకు కృతజ్ఞతలు తెలుపుతున్న లక్ష్మీనగర్ కాలనీ వాసులు

రాజేంద్రనగర్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొండ్ర సంగీత గౌరీశంకర్ అన్నారు. ఆదివారం ఆమె డివిజన్ పరిధిలోని హైదర్‌గూడ లక్ష్మీనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లకు ఇరువైపుల పేరుకుపోయిన చెత్తచెదారాలు, మట్టికుప్పలు, వ్యర్థాలను తొలగింపజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తచెదారాలు, ఇంటి నిర్మాణ వ్యర్థాలు, మట్టి కుప్పలను రోడ్లకు ఇరువైపుల, ఖాళీ ప్రదేశాల్లో డంప్ చేయరాదన్నారు. ప్రజలు డివిజన్ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కార్పొరేటర్‌కు పూలబొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది ఎస్‌ఎస్ శేఖర్, ఎస్ఎఫ్ఏ వినయ్, లక్ష్మీనగర్ కాలనీ అధ్యక్షులు మూర్తి, ప్రధాన కార్యదర్శి స్వామి, బీజేపీ నాయకులు బిట్కూరి సిద్ధేశ్వర్, పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు, సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఉచితంగా మిల్లెట్స్ అల్పాహారం పంపిణీ



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: చిరుధాన్యాలు కండరాల పనితీరును మెరుగుపరుస్తాయని బీజేపీ సీనియర్ నాయకులు అంజన్‌కుమార్ యాదవ్, వై.శ్రీధర్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్‌పల్లిలో ఆదివారం ఉచితంగా మిల్లెట్స్‌తో తయారు చేసిన అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా చిరుధాన్యాల ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. కాల్షియం ఎక్కువగా ఉన్న మిల్లెట్స్‌ను ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బొక్క బాల్‌రెడ్డి, కొమురయ్య, పసుపుల సందీప్‌ముదిరాజ్, సామ నవీన్‌రెడ్డి, పుస్తకాల నర్సింగ్‌రావు, బొక్క అనంతరెడ్డి, షాబాద్ విజయ్, కీర్తి శ్రీను, కృష్ణగౌడ్, అశోక్‌రెడ్డి, సోల్కర్‌రెడ్డి, విజయ్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, స్వప్నరెడ్డి, వెంకటేష్, మల్లేష్, వేణు, కీర్తిజగన్, పసుపు దినేష్, రవి, పసుపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన



బంగారు మైసమ్మ ఆలయ పైకప్పు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్

బండ్లగూడ: దేవాలయాల్లో మానసిక ప్రశాంతత లభిస్తుందని అందరూ దైవచింతన అలవర్చుకోవాలని బండ్లగూడ జాగీరు కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ అన్నారు. బృందావన్ కాలనీలోని బంగారు మైసమ్మ ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ఆదివారం ఆలయ పైకప్పు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. చారిత్రక బంగారు మైసమ్మ దేవాలయాన్ని అధునాతన పద్ధతిలో అందంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తలారి ప్రేమ్‌కుమార్, సురేష్, కోరివి గణేష్, గోపాల్, రమేష్, శ్రీనివాస్, జంగయ్య, ప్రభాకర్, శ్రీకాంత్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే వారి నోరు నొక్కుతున్నారు



మాట్లాడుతున్న బీజేవైఎం నాయకులు

రాజేంద్రనగర్: ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే వారిని అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు బైక్ శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ప్రజా వ్యతిరేఖ విధానాలు అనుసరిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఆదివారం అత్తాపూర్‌లోని పార్టీ డివిజన్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ ప్రశ్నా పత్రాల లీకేజీలో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిని అరెస్టు చేయాలన్నారు. అభ్యర్థుల పక్షాన నిలపడి పోరాడుతున్న బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు భానుప్రకాష్, వినయ్‌రెడ్డిలను రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గ్రూప్-1 పరీక్షలను వెంటనే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మణికంఠ, రాకేష్‌గౌడ్, బీజేపీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు విజయ్‌కుమార్, శివ, సిద్ధు, అరుణ్‌కుమార్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో ఆరోగ్య భద్రత

శంషాబాద్ రూరల్: ఆరోగ్య భద్రత కోసం ప్రతి ఒక్కరు ఆయుష్మాన్ భారత్ పథకంలో పేర్లు నమోదు చేసుకోవాలని బీజేవైఎం అడిషనల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మహేందర్ అన్నారు. ఆదివారం స్థానిక 8వ వార్డులో నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ఆయుష్మాన్ భారత్ కార్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇలాంటి పథకాలను సామాన్యులకు అందించేందుకు బీజేపీ కార్యకర్తలు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవి, వినయ్‌కుమార్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

మల్కారంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని మల్కారంలో ఏవీకాలేజ్ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ -2 విద్యార్థులు ఆదివారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్త సేకరణపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.అంజయ్య, సర్పంచు మాధవి యాదగిరిరెడ్డి, ఉపసర్పంచ్ లలితజంగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

తప్పిన పెనుప్రమాదం



లారీ తగిలి వంగిపోయిన విద్యుత్ స్తంభం

మణికొండ: భారీ వాహనం తగిలి విద్యుత్ వైర్లు తెగిపోయిన సంఘటన మణికొండ మునిసిపాలిటీ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. అయితే ఆ సమయంలో అటు వైపు ఎవరూ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే..మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ చౌరస్తా నుంచి మర్రిచెట్టు సర్కిల్ మార్గంలో భారీ వాహనాలు వెళ్లకుండా ఇటీవల బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయినా రాత్రి వేళల్లో క్రషర్ లారీల నిర్వాహకులు వాటిని తొలగించి రాకపోకలు సాగిస్తున్నారు. ఆ రోడ్డులో విద్యుత్ వైర్లు, కేబుల్ వైర్లు కిందకు వేలాడుతుండటంతో తరచూ వాహనాలకు తగులుతున్నాయి. శనివారం రాత్రి అటుగా వచ్చిన రెడీమిక్స్ కేబుల్ వైర్లకు తగలటంతో విద్యుత్ వైర్లు సైతం తెగిపోయాయి. అయితే ఆ సమయంలో అటుగా ఎవరూ రాకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు కౌన్సిలర్ బి.శ్వేత రవికాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో వారు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టండి



ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన అంబులెన్స్



ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారులు

రాజేంద్రనగర్: శివరాంపల్లి నుంచి బహదూర్‌పురాకు వెళ్లే ప్రధాన రహదారిపై ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ మార్గంలో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందన్నారు. ఆరాంఘర్ చౌరస్తా నుంచి శివరాంపల్లి, నేషనల్ పోలీస్ అకాడమీ మీదుగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా ఈ రహదారి పూర్తిగా గోతులమయంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలు స్తంభిస్తున్నాయన్నారు. గంటల తరబడి వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతుండటంతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కోసారి అంబులెన్స్‌కు సైతం దారి ఇవ్వలేని పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ పోలీసులను నియమించాలని కోరుతున్నారు.

పూలే జయంతి ఉత్సవ కమిటీ ఏర్పాటు



ఉత్సవ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని మహాత్మ జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ముద్దగోని మల్లికార్జునగౌడ్, ప్రధాన కార్యదర్శిగా పిట్టల శివముదిరాజ్, ఉపాధ్యక్షులుగా దయానంద్‌గౌడ్, కె.రఘుముదిరాజ్, పి.భిక్షపతి, సాయిమాలిక్, రాధాకృష్ణ, కోశాధికారిగా వేముల రమేష్, సంయుక్త కార్యదర్శిగా సురేష్, పులిజాల శ్రీను, ముఖ్య సలహాదారులుగా కె.కృష్ణమాచారి, డి.సత్యనారాయణ ముదిరాజ్, రాపోలు సత్తయ్య, బంగి శ్రీను, రఘుగౌడ్, అంజయ్యగౌడ్, కె.యాదయ్య ముదిరాజ్ ఎన్నికయ్యారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

బండ్లగూడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసేంత వరకు సీఐటీయూ పోరాటం చేస్తుందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షులు రుద్రకుమార్ అన్నారు. ఏప్రిల్ 5న చలో ఢిల్లీ నిరసన యాత్రలో భాగంగా చేపట్టిన జీపు జాతా రెండో రోజు గండిపేట మండలం, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తున్నాయని, ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ధరలను తగ్గించాలని, కనీస వేతనంగా రూ.26 వేలు అవ్వాలన్నారు. స్కీం వర్కర్లు, మున్సిపల్ కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. మున్సిపల్ కార్మికులకు రూ. 21 వేల వేతనం చెల్లించాలన్నారు. షాపింగ్ కాంప్లెక్స్, కాంట్రాక్ట్ కార్మికులు, కాలేజీ, స్కూల్స్ తదితర రంగాల్లో పని చేస్తున్న కార్మికులందరికీ కార్మిక చట్టాల ఆధారంగా వేతనాలు అమలు చేయాలన్నారు. ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ నిరసన యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, యాదగిరి, సురేష్, సుభాష్, నరేందర్, నవీన్, మల్లేష్, వెంకటేష్, రాము, లక్ష్మమ్మ, నరసమ్మ, దేవి, భారతమ్మ, జి.నాగేష్‌గౌడ్, లక్ష్మణ్ కుమార్‌గౌడ్, రామాంజి, వెంకట్‌రెడ్డి, మహేష్‌యాదవ్, సునీల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో ఉగాది ఉత్సవాలు



సాక్షి, సిటీబ్యూరో: తెలుగు నూతన సంవత్సరాది ఉగాది సందర్భంగా తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో దుబాయ్‌లోని దుబాయ్ హైట్స్ అకాడమీలో శనివారం సాయంత్రం ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తెలుగు అసోసియేషన్ తరఫున కల్చరల్ డైరెక్టర్ వక్కలగడ్డ వెంకట సురేష్ నేతృత్వంలో ప్రముఖ యాంకర్ రవి, ఉష, శరణ్య సంధాన కర్తలుగా వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ, ప్రముఖ కథా నాయిక కామ్నా జెఠ్మలానీ, సినీ నిర్మాత రాజశేఖర్ వర్మ, న్యాయమూర్తి మాధవ రావు పట్నాయక్ పాల్గొన్నారు. జల్ వినోద్ అమృతత్వం, సెల్ ఫోన్ అంశాలు, తెలంగాణ ప్రముఖ ప్రాంతాలపై ఈ సందర్భంగా ఆలపించిన గజల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఎంఎం శ్రీలేఖ , మౌనిక యాదవ్, గాయకులు రవి, గజల్ వినోద్‌లతో కలిపి ఆలపించిన సినీ గీతాలు ప్రేక్షకులను అలరింపజేశాయి. కార్యక్రమంలో తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు దినేష్ కుమార్, జనరల్ సెక్రటరీ వివేకానంద్ బలుస, ప్రతినిధులు మసిద్దీన్, ప్రతినిధులు సురేంద్ర, మురళీకృష్ణ, సాయి ప్రకాష్, రవి, అంబేద్కర్, శ్రీధర్, విక్రమ్, విమల, సౌజన్య, విజయభాస్కర్, ఫహీమ్, మోహనకృష్ణ, శరత్ చంద్ర, శంకర్ పాల్గొన్నారు.

ఏ నిమిషానికి ఏమి జరుగునో.?

- ప్రమాదభరితంగా సెల్లార్ గుంత
- కుంగుతున్న సమీప భవనాల పునాదులు



సెల్లార్ గుంతలో నిలిచిన వరద, మురుగు నీరు



పక్కన ఉన్న నిర్మాణం కుంగుతున్న దృశ్యం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ చౌరస్తాలో భవన నిర్మాణం కోసం గతంలో తవ్విన సెల్లార్ గుంత ప్రమాదకరంగా మారింది. ఈ సెల్లార్ పక్కనే ఉన్న నిర్మాణాలకు ముప్పుగా పరిణమించింది. సెల్లార్ గుంతలోకి వరద నీరు, మురికి నీరు చేరడంతో పరిసర ప్రాంతాల్లో భూమి కుంగుతుందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి సెల్లార్‌ను మూసివేయాలని కోరుతున్నారు. రాజేంద్రనగర్ చౌరస్తాలోని బేకరీ పక్కన గతంలో భవన నిర్మాణం కోసం సెల్లార్ గుంతను తవ్వి వదిలేశారు. ప్రస్తుతం ఈ గుంతలో మురుగు నీటితో పాటు వర్షపు నీరు చేరింది. దీంతో ఈ సెల్లార్ పక్కనే ఉన్న నిర్మాణాల పునాదులు కుంగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. అధికారులు జోక్యం చేసుకుని గుంతను పూడ్చివేయాలని కోరుతున్నారు.

నక్షత్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా బాల్‌రెడ్డి



మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్ పరిధిలోని నక్షత్ర గేటెడ్ కమ్యూనిటీ రెసిడెంట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వి. బాల్‌రెడ్డి రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం క్లబ్ హౌస్‌లో జరిగిన సమావేశంలో ఎన్నికల అధికారులుగా ప్రమోద్‌రెడ్డి, నీలీష్‌ప్రసాద్ వ్యవహరించారు. కమిటీ ప్రధాన కార్యదర్శిగా నరేంద్ర, ఉపాధ్యక్షులుగా దిలీప్, కామేశ్వర్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా సల్మాన్, శ్రీనివాస్ వర్మ, కోశాధికారులుగా విజయ్, తేజ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఫామిల్ షేక్, సూర్య, ఉదయ్‌కిరణ్, ఉదయ శంకర్, రఘు, నాగార్జున , శ్రీధర్‌లను ఎన్నుకున్నారు.